బఫర్ జోన్‌పై అనుమానాలు నివృత్తి చేయండి



సూర్యాపేటలో మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురి చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో శుక్రవారం బాధిత కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బఫర్ జోన్‌పై పేదలకున్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. భూ ఆక్రమణకు పాల్పడిన బడాబాబులు, స్థిరాస్తి వ్యాపారుల నుంచి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, గోపగాని రవి, పి.కృష్ణ, వాడపల్లి వెంకన్న, పెంద్ర నవీన్, రవి, వెంకన్న, గూడెల్లి రంగా పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా నీటి విడుదల

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వలో పాలేరు వరకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ఎడమ కాల్వ పరిధిలో 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డిజైన్ ప్రకారం 5 వేల క్యూసెక్కులు విడుదల చేయాల్సి ఉండగా, పాలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి 2 వేల కూసెక్కుల వరద వస్తుండటంతో ఎడమ కాల్వలో నీటి విడుదలను తగ్గించారు. ప్రస్తుతం కాల్వలో 9 అడుగుల మేరకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎడమ కాల్వ పరిధిలోని అన్ని మేజర్ కాల్వలు, మైనర్ కాల్వలు, లిఫ్టులకు సాగునీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాగితరామచంద్రాపురం వద్ద గండి పూడ్చిన చోట ఎడమ కాల్వను శుక్రవారం డీఈఈ రఘు, జేఈ సత్యనారాయణలు పరిశీలించారు. గండి వద్ద 5.2 మీటర్ల ఎత్తు వరకు ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేసినట్లు జేఈ తెలిపారు. కాల్వ కట్టపై మరో రెండు లేయర్లు మట్టి చదును చేయడంతో పాటు డబుల్ బండ్ ఏర్పాటు చేయాల్సి ఉందని, రెండు రోజుల తర్వాత ఆ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రంగుల వారధి వద్ద కాల్వ కట్టను సైతం పటిష్ఠం చేసే పనులు చేపట్టాల్సి ఉందన్నారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా సాగునీటి విడుదల కొనసాగుతుందన్నారు.

20 రోజుల్లో పనులు పూర్తి: సీఈ


చెరువుల గండ్లను పూడ్చేందుకు వినియోగించే మట్టిని పరిశీలిస్తున్న సీఈ రమేశ్‌బాబు

మఠంపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మఠంపల్లి మామిళ్ల చెరువు, చౌటపల్లి ఊర చెరువులకు పడిన పెద్ద గండ్లను పూడ్చివేసే పనులు 20 రోజుల్లో పూర్తవుతాయని నీటి పారుదల శాఖ సీఈ రమేశ్ బాబు చెప్పారు. సుమారు రూ.4 కోట్లతో చేపడుతున్న ఈ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కట్టలను బలోపేతం చేయడానికి ఉపయోగించే మొరం మట్టిని ఎర్రగట్టు వద్ద ఉన్న క్వారీలకు అధికారులతో వెళ్లి పరీక్షించారు. మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. భవిష్యత్తులో గండ్లు పడే అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సీఈ వెల్లడించారు. ఎస్ఈ ధర్మతేజ, ఈఈ రామకిషోర్, డీఈ బిక్షం, ఏఈ తుమ్మా శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ విస్మరిస్తే చర్యలు


సూర్యాపేటలో వృద్ధుల అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), భానుపురి, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి కె.నర్సింహరావు అన్నారు. తమ తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సూర్యాపేటలో వృద్ధులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, వారిని జాగ్రత్తగా చూసుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మినీ ట్యాంకు బండ్ వద్ద అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల అసోసియేషన్ అధ్యక్షుడు అర్రే రామకృష్ణారెడ్డి, సభ్యులు విద్యాసాగర్, ఎస్.డి.హమీద్‌ఖాన్, భాస్కర్‌చారి, శ్యాంసుందర్, సీడీపీవోలు సుబ్బలక్ష్మి, శ్రీజ, కె.విజయ చంద్రిక, హుస్సేనా, సంజీవ, వినోద్‌కుమార్, పాల్గొన్నారు.

అందేదెప్పుడో..?




నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధరణి వెబ్‌సైట్ ద్వారా రోజూ తహసీల్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో భూరిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఈ పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మీసేవ కేంద్రాలకు రోజూ వెళ్తూ రిజిస్ట్రేషన్ జరిగిందా.? అసలు పట్టాదారు పాసు పుస్తకం వస్తుందా.? రాదా? అని ఆరా తీస్తున్నారు.

అన్ని పథకాలకు ప్రామాణికం

రుణమాఫీ, పంట రుణాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్రపరికరాలు, పాడి పశువులు పంపిణీకి పట్టాదారు పాసు పుస్తకమే ప్రామాణికం. ఉద్యాన పంటలకు ఉపయోగించే బిందు, తుంపర, పాలీ హౌజ్‌లకు సంబంధించి సామగ్రి రాయితీపై మంజూరుకు పాస్‌పుస్తకం ఆధారంగా చూపించాల్సి ఉంటుంది.

ప్రక్రియ ఇలా..

- రిజిస్ట్రేషన్లకు ముందు క్రయ విక్రయదారులు మీసేవలో స్లాట్ బుక్ చేయాలి. ఆ సమయానికి తహసీల్ కార్యాలయానికి హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియకి రుసుములు చెల్లించాలి. ఆ తర్వాత నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి అంతర్జాలంలో సీసీఎల్ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాలయానికి దస్తావేజు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకంలో వివరాలన్నీ నమోదైన తర్వాత నేరుగా తపాలా శాఖ ద్వారా కొనుగోలుదారు చిరునామాకు చేరుతుంది.
- వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మొత్తం తహసీల్ కార్యాలయంలోనే జరుగుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ ఇతరత్రా అన్ని రుసుములు కలిపి గరిష్ఠంగా రూ.20వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తుంది.
- గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే పాస్‌పుస్తకం ఉన్నవారికైతే అందులోనే క్రయ, విక్రయాల వివరాలు కొత్తవి నమోదు చేసి ప్రింట్ తీసి అప్పటికప్పుడే అందించేవారు.
- ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పక్షం రోజుల్లోపు పట్టాదారు కొత్త పాస్‌పుస్తకం రైతులకు చేరేది. ప్రస్తుత ఆలస్యానికి కొత్త పుస్తకాల కొరత కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 వేల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కావాల్సి ఉంది.



ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు రిజిస్ట్రేషన్లు: 700 వరకు

ప్రభుత్వానికి ప్రతిరోజు వస్తున్న ఆదాయం: రూ.3 కోట్లు

పాస్‌పుస్తకాలకు ఎదురు చూస్తున్న వారు: 50 వేల మంది

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రజల అభ్యున్నతి, ఆకాంక్షలను నెరవేర్చిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియాడారు. లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు దిశా నిర్దేశం చేశారని, ప్రజలు ఆర్థికంగా బలపడాలని ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనసూయ, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి లత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పద్మారావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నర్సింహ, జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్: జిల్లాలో అద్భుతమైన చారిత్రక సంపద ఉందని.. మన పురాతన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుంచుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పర్యాటక రంగం, చరిత్రపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. తొలుత నిర్వహించిన పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో అశోక్‌కుమార్, జిల్లా పర్యాటక అధికారి ఎ.రమేష్‌కుమార్, భానునాయక్, డి.జనార్దన్, రామ్‌సుధీర్ రెడ్డి, ఎస్.కె.రెహానా బేగం, మల్లేశం, డి.మల్లయ్య, ఉమా రాణి పాల్గొన్నారు.


సూర్యాపేట: కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

గృహజ్యోతి వెలిగింది..!


విద్యుత్తు రీడింగ్ తీస్తున్న సిబ్బంది

భానుపురి, న్యూస్‌టుడే: జిల్లాలో గృహజ్యోతి పథకం ఫలాలు అర్హులకు అందుతున్నాయి. వివిధ కారణాలతో మొదట కొంత మంది అర్హులు పథకానికి దూరంగా ఉన్నారు. 200 యూనిట్ల విద్యుత్తు వినియోగించిన పేదలందరికీ గృహజ్యోతి వర్తింపజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల్లో మొదట 1,47,000 మంది పథకానికి ఎంపికయ్యారు. కొంతమందికి అర్హత ఉన్నా ఉచిత కరెంటు పొందలేకపోయారు. వారి నుంచి జిల్లాలోని పురపాలికలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించి తప్పిదాలను సవరించారు. ఏడు నెలలుగా ఎడిట్ ఆప్షన్ ఓపెన్‌కాలేదు. ఇటీవల ఓపెన్ కావటంతో చాలామంది అర్హత సాధించారు. 'లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో జులై కంటే ఆగస్టులో ఉచిత కరెంటు వాడకం పెరిగింద'ని ఎస్ఈ బి.ఫ్రాంక్లిన్ తెలిపారు.

పథకం గణాంకాలు	
జిల్లాలో మొత్తం గృహ విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య:	4,51,501
ఇందులో గృహజ్యోతికి మొదట అర్హత పొందిన వారు:	1,47,000 మంది
రెండో సారి పెరిగిన లబ్ధిదారులు:	28,280 మంది
ప్రస్తుతం మొత్తం లబ్ధిదారుల సంఖ్య:	1,75,280 మంది
వీరిలో 200 యూనిట్ల లోపు కరెంటు వాడినవారు:	1,67,408 మంది
200 కంటే ఎక్కువగా వాడుకున్న వారు:	7,872
ఆగస్టులో ప్రభుత్వం విడుదల చేసిన నిధులు:	రూ.613.69 లక్షలు

ఆక్రమణదారుల్లో హైడ్రా దడ

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో అధికారుల తనిఖీలతో ఆక్రమణదారులు హడలెత్తిపోతున్నారు. ఇన్నేళ్లు తమకు ఎలాంటి అడ్డులేదనుకున్న వారికి ప్రభుత్వం హైడ్రాను తీసుకురావటంతో దడ పుడుతోంది. సూర్యాపేట పట్టణంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కట్టిన నిర్మాణాలను రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పుర అధికారులు పరిశీలిస్తున్నారు. రెండ్రోజులుగా సద్దులచెరువు కట్ట కింది నివాసాలను పరిశీలిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నారు. సూర్యాపేటలో ప్రస్తుతం ఎక్కడ చూసినా హైడ్రాపై చర్చ జరుగుతోంది. ప్రధాన కూడళ్లు, టీస్టాళ్లు, తదితర చోట్ల సూర్యాపేటకు హైడ్రా వస్తుందా అనే మాట్లాడుకుంటున్నారు.


సూర్యాపేటలో ఇళ్ల సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, పుర అధికారులు

ఇదీ పరిస్థితి

- మానసనగర్, తిరుమలనగర్, ఆర్.కె.గార్డెన్ కాలనీ, తాళ్లగడ్డలో నాలాలు ఉన్నాయి. ఆక్రమణల కారణంగా నాలాలు కుచించుకుపోయాయి.
- నాలాల ఆక్రమణ కారణంగా చిన్నపాటి వర్షానికి వరదలు పొంగిపొర్లుతున్నాయి. మిగతా వార్డులు నీట మునుగుతున్నాయి.
- గతేడాది మానసనగర్, తిరుమలనగర్, ఆర్.కె.గార్డెన్‌కాలనీ, తదితర కాలనీల్లోకి వరద ముంచెత్తింది. రెండు, మూడు రోజుల వరకు నీరు నిల్వ ఉండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. తిరుమలనగర్‌లో నాలా కుచించుకుపోవడంతో వర్షం కురిస్తే నీరు నిలుస్తోంది.

ఆదేశాలు రాలేదు

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

సూర్యాపేట పట్టణంలో నాలాలు, చెరువుల ఆక్రమణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలన చేపడతాం. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే పరిశీలన చేసి అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారుల సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.

ఇళ్ల సర్వే నిలిపివేయాలని ఆందోళన


సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పుల్లారెడ్డి, సద్దుల చెరువుల సమీపంలో చేపడుతున్న సర్వేను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఆయా కాలనీల ప్రజలు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటిపారుదల, రెవెన్యూ, పుర అధికారులు ఇంటి గోడలపైన గుర్తులు వేయడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే ఈ చర్యలను మానుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీల వాసులు నాగార్జున, మల్సూర్, మధు, మహేశ్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తేలని పంట లెక్క

- జిల్లాలో 70 శాతం నమోదు పూర్తి


పంటల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏ పంట ఎక్కువ సాగు అవుతోంది... ఏ గ్రామాల్లో ఎన్ని రకాల పంటలు ఉన్నాయి.. తదితర వివరాలన్నీ పంట నమోదులో తెలుస్తోంది. మండల వ్యవసాయ అధికారులు నేరుగా క్షేత్రాల వద్దకు వెళ్లి ప్రత్యేక యాప్‌లో రైతు, పంటల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. దీని ప్రకారం అధికారులు కొనుగోళ్లకు సన్నద్ధం అవుతారు. కానీ జిల్లాలో నేటికీ పంట నమోదు పూర్తి కాలేదు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4,09,902 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. వ్యవసాయ అధికారుల పంటల అంచనా మేరకు ఇంకా లక్షన్నర ఎకరాలను నమోదు చేయాల్సి ఉంది. త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎదురయ్యే ఇబ్బందులు..

జిల్లాలో ఈ వానాకాలం 5,99,900 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వరి, పత్తి, ఇతర పంటల కలిపి ఇప్పటి వరకు 4,09,902 ఎకరాలను నమోదు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు తప్పని సరిగా నమోదు చేయాల్సి ఉంది. లేకుంటే విపత్తుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే ఆ వివరాలు ఉండవు. పండించిన పంటలు అమ్ముకోవాలంటే వ్యవసాయ అధికారుల వద్ద ఆన్‌లైన్‌లో చూపించాలి. లేకుంటే కొనుగోలు చేసే సమయంలో రైతుల వివరాలు లభించవు. దీంతో అప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అక్టోబరు 10 వరకు వరి ధాన్యం కొనుగోళ్లను చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఆలోపు పూర్తి చేసేలా సన్నాహాలు చేపడుతున్నారు.

కారణాలు

- ప్రధానంగా రైతు రుణమాఫీకి సంబంధించి అర్హుల జాబితా తయారీ.
- రుణమాఫీ కానీ వారి వివరాలు సేకరించడం.
- వారి ఇళ్లకు వెళ్లి స్వీయ చిత్రం.. వివరాలు నమోదు చేసుకోవడం.
- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటల సర్వే చేయడం వంటి కారణాలన్నీ పంట నమోదుకు అడ్డంకులుగా మారాయి.
- ఏఈవోలు వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లడం కష్టతరంగా మారడం.
- వ్యవసాయ భూముల వద్ద సర్వర్ సమస్య ఎదురవడం.

పూర్తి చేసేందుకు చర్యలు

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

రుణమాఫీ, పంట నష్టం ఇతర కారణాల వల్ల పంటల నమోదు ఆలస్యమైంది. ఏఈవోలు వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

పంట పేరు	వరి	పత్తి	కంది	పెసర	ఇతర
నమోదైన విస్తీర్ణం (ఎకరాల్లో)	3,32,639	69,338	1,935	2,497	3,493

ఆనవాళ్లు ఆక్రమణలో కలిసిపోతున్నాయ్..!


నాగార్జునసాగర్ ఎడమ కాలువపై త్రిపురారం మండలంలో కనీసం వాహనం వెళ్లేందుకు కూడా స్థలం లేని తీరు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విజయవాడ, ఖమ్మం జిల్లాల్లో వరదలు వచ్చి ఇళ్లు ముంపునకు గురికాగా.. జనజీవనం అస్తవ్యస్తమైంది.. దీనికి ప్రధాన కారణం కాల్వల ఆక్రమణలే అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ, మేజర్లు, మైనర్ల పరిధిలో స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎడమకాలువ నిర్మాణ సమయంలో కాలువకు రెండు వైపులా కనీసం 50 మీటర్ల స్థలం ఉండేలా నిర్ణయించారు. కొన్ని చోట్ల కాల్వ నిర్మాణానికి అవసరమైన మట్టిని తోడేందుకు 10 ఎకరాల మేరకు ఎన్నెస్పీ అధికారులు స్థానికంగా రైతుల నుంచి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ స్థలాలన్నీ ఆక్రమణకు గురయ్యాయి. కాల్వకు రెండు వైపులా ఉన్న రహదారులు సైతం కనుమరుగై పోతున్నాయి. దీంతో ఎడమ కాలువ తెగిన సమయంలో మట్టికోసం దూర ప్రాంతాల నుంచి తరలించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎన్నెస్పీ ఆధీనంలో గతంలో సేకరించిన స్థలాలు ఉంటే అక్కడి నుంచే మట్టిని తరలించుకోవచ్చని ఓ అధికారి తెలిపారు.

- మేజర్ కాల్వలకు 30 అడుగులు, మైనర్లకు కనీసం 15 అడుగుల స్థలం ఉండేలా ఆయా కాల్వల డిజైన్ల ఆధారంగా నిర్ణయించినప్పటికీ.. ప్రస్తుతం ఈ స్థలాలన్నీ కనుమరుగైపోయాయి. గతేడాది ఎడమకాలువ పరిధిలో నీరు విడుదల చేయలేదు. దీంతో మేజర్లు, మైనర్లు వ్యర్థాలతో నిండిపోయాయి. వాటిని శుభ్రం చేసేందుకు యంత్రాలు సైతం కాల్వపైకి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నోటీసులు ఇచ్చాము

జనార్దన్,
నీటిపారుదల విభాగం డీఈ

మైనర్ల పరిధిలోని స్థలాలను రైతులు ఆక్రమించిన విషయమై గ్రామాల్లో నోటీసులు ఇచ్చి, డప్పు చాటింపు చేయించాం. గతంలోని రికార్డుల ఆధారంగా సరిహద్దులు నిర్ణయించి హద్దురాళ్లు అమర్చుతాం.

రైతులు ఆక్రమణలు తొలగించాలి

గోపీనాథ్‌రెడ్డి, ఎన్నెస్పీ డీఈ

ఎడమకాలువ పక్కన ఆక్రమించిన రైతులు స్వచ్ఛందంగా తొలగించాలి. కనీసం స్థలం లేకుండా ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారు. చాలాచోట్ల ఎన్నెస్పీ ఎడమ కాల్వ నిర్మాణ సమయంలో మట్టి తవ్వకం కోసం స్థలాలు ఉన్నాయి. వీటిని సైతం ఆక్రమిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆయకట్టు పరిధిలో 54 మేజర్ కాలువలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 24, నల్గొండ జిల్లాలో 30 మేజర్ కాలువలు ఉన్నాయి. నల్గొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల విస్తీర్ణం సాగుచేస్తున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలో మేజర్లు, ఎత్తిపోతల కింద 2.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఆయా రకాల పంటలు సాగు చేస్తున్నారు.


మిర్యాలగూడ పట్టణంలోని మేజర్ కాల్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు

కాల్వ భూములు కబ్జా..!



ఈ చిత్రంలో వరి సాగు చేసిన ప్రాంతం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ ద్వారా వెళ్లే ఎన్నెస్పీ కాల్వ భూమి. గతంలో ఈ కాల్వ కట్ట మీద నుంచి వాహనాలు వెళ్లేవి. అవతలి వైపు సాగు చేసే రైతుల ట్రాక్టర్లు సైతం ఇక్కడి నుంచి వెళ్లేవి. ఇప్పుడు ఈ భూమిని దున్ని వరి సాగు చేయడంతో వాహనాలు వెళ్లలేని దుస్థితి. కాల్వ మీద తిరిగే సిబ్బంది కూడా వెళ్లే పరిస్థితి లేదు.

కోదాడ, న్యూస్‌టుడే: కాల్వ కట్టకు ఉండాల్సిన భూమి సరిగ్గా ఉంటేనే అది బలంగా ఉంటుంది. కానీ నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని కాల్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కాల్వ వెంబడి ఉన్న భూమిని కొందరు కబ్జా చేసి పంటలు వేస్తున్నారు. ఫలితంగా కాల్వ కట్టలు నాసిరకంగా తయారై తెగిపోవడం ఇటీవలే చూశాం. ఆక్రమణలతో కాల్వల్లో పారే నీటిని పరిశీలించే సిబ్బంది రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి.

బలహీనంగా తయారై..

ఎన్నెస్పీ పరిధిలోని మేజర్, మైనర్ కాల్వ కట్టలు ఆక్రమణకు గురికావడంతో బలహీనంగా తయారై తెగిపోతున్నాయి. ఇటీవల వరదలకు చిలుకూరు మండలంలోని ఆర్లేగూడెం వద్ద కట్ట తెగిపోవడానికి ఆక్రమణ కూడా ఓ కారణమని స్థానిక రైతులు చెబుతున్నారు. కాల్వ రికార్డుల ప్రకారం ఎంత భూమి కబ్జాకు గురైందో ఇట్టే తెలుసుకోవచ్చు. కానీ జలవనరుల శాఖ అధికారులు ఆ దిశగా ముందడుగు వేయట్లేదు. కాల్వ కట్టలు తెగిన సమయంలోనే హడావుడి చేస్తున్నారు. కొందరు రైతులు నేరుగా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించట్లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు

సువర్ణరేఖ, డీఈ, జలవనరుల శాఖ, కోదాడ

ఎన్నెస్పీ కాల్వ భూములు కబ్జా చేయడం చట్టరీత్యా నేరం. కొన్ని చోట్ల కబ్జాకు గురైన మాట వాస్తవమే. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, కబ్జాకు గురైన భూములను వెనక్కి తీసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

యువ హృదయాలు ఉప్పొంగె..!

నల్గొండ జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని కేపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొని క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.
– న్యూస్‌టుడే, నల్గొండ టౌన్, ఈనాడు, నల్గొండ


ఉల్లాసం.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల నృత్యం


కోలాటం.. దేవరకొండ గురుకుల కళాశాల విద్యార్థుల ప్రదర్శన


దరహాసం.. దేవరకొండ కేజీబీవీ విద్యార్థినుల ప్రదర్శన


ఉత్సాహం.. పాల్గొన్న విద్యార్థులు

నాటి ప్రతిభకు తార్కాణం..
నేటికీ చెక్కుచెదరని వైనం

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ సూర్యాపేట జిల్లా శివారు కాగితరామచంద్రాపురం సమీపంలోని ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం చేరువలో నాటి ఇంజినీర్ల ప్రతిభకు తార్కాణంగా నిలిచింది ఈ రోడ్డు వారధి. ఇక్కడ సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు వైపుల నుంచి వచ్చే రహదారి కలిసేలా వారధి నిర్మాణం చేపట్టారు. పైనుంచి నాలుగు వైపుల రహదారి, కింద నుంచి సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు ప్రవహించేలా వారధి నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నాలుగు రహదారులు కలుస్తుండటంతో వారధికి ఉన్న రక్షణ గోడలను గుర్తించేలా రకరకాల రంగులు వేశారు. దీంతో దీనికి రంగుల వారధిగా పేరు వచ్చింది. ఈ కట్టడం నేటికీ చూపరులను ఎంతో ఆకర్షిస్తుంది. కాల్వ పైనుంచి రెండు రహదారులు వెళ్లడం, కింద నుంచి నీరు ప్రవహించే తీరు దర్శనీయం ప్రాంతంగా గుర్తింపు తెచ్చింది.

–నడిగూడెం, కోదాడ, న్యూస్‌టుడే:



ఆడాలనే ఆసక్తి.. అడుగెయ్యలేని దుస్థితి

సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్: చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణంగా పెరిగాడు ఆ కుర్రాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటాడు. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. కానీ ఆ ఎంపికకు వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆడాలనే ఆసక్తి, పాల్గొనే అవకాశమున్నా ఆర్థిక స్థితి సహకరించక సతమతమవుతున్నాడు.

✦ సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన గోపరాజు భిక్షపతి-కవిత కుమారుడు అర్జున్ అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తూ పలు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుకుంటున్నాడు. ఇటీవలే చెన్నై, మధ్యప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాడు. అతని ప్రతిభను గుర్తించిన ఎన్‌ఎస్‌ఎల్ అకాడమీ.. హైదరాబాద్‌లో ఇంటర్ నేషనల్ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. అక్కడ సత్తా చాటడంతో అండర్-19లో శ్రీలంకలోని కొలంబోలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు కూడా ఇచ్చారు. అక్టోబరు 20 నుంచి 29 వరకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడు.


కప్పుతో గోపరాజు అర్జున్

✦ అర్జున్‌ది నిరుపేద కుటుంబం. రెక్కాడితే కాని డొక్కాడని దుస్థితి. అక్కతోపాటు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఆటలో ఇక్కడి వరకు రావడానికి తల్లిదండ్రులు రూ.లక్ష వరకు అప్పు చేసినట్టు వాపోయాడు.

రోగాలు కొని తెచ్చుకుంటున్నారు..!


పంటల్లో పురుగు మందుల పిచికారీ చేస్తున్న రైతు

గరిడేపల్లి, మునగాల, న్యూస్‌టుడే: మానవ శరీరం రసాయనాలతో నిండుతోంది. ఏటా రైతులు వాడుతున్న పురుగు మందుల మోతాదు రెట్టింపవడంతో మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. తెలియకుండానే రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. నిబంధనలు పాటించాల్సిన రైతులు, దుకాణం యజమానులు వాటికి తిలోదకాలిచ్చేస్తున్నారు. ఇటీవలి పలు అధ్యయనాలు, సర్వేలూ ఇదే చెబుతున్నాయి.

భారీగా వినియోగం..

రైతులు సాగు చేస్తున్న పంటలో పురుగులు, తెగుళ్లు ఆశిస్తే తక్షణమే నివారించుకోవడానికి రసాయన పురుగుమందులు వాడుతున్నారు. నిదానంగా ప్రభావం చూపేవి, తక్షణమే ప్రభావం చూపేవీ రెండు రకాలు ఉన్నా.. ఎక్కువ మంది రైతులు రెండో రకానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో పాటు కంపెనీ, శాస్త్రవేత్తలు చూపిన మోతాదుల కంటే అదనంగా వినియోగిస్తున్నారు.

◆ పంటలపై పిచికారీ చేసిన మందు 10 శాతం ఆశించిన పురుగులు, తెగుళ్లపై ప్రభావం చూపుతుండగా మిగిలిన ద్రావణం కొంత ఆవిరిగా, మరికొంత భూగర్భజలంలో, మరికొంత మనం తినే ఆహార పదార్థాలలో అవశేషాలుగా మిగిలిపోతున్నాయి. రోజూ కొంత మొత్తంలో శరీరంలోకి వెళ్తుండటంతో క్రమేపీ ఏదో ఒక వ్యాధికి కారణమవుతున్నాయి.

◆ వాస్తవానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖ మానవ ఆరోగ్యంపై తక్కువ ప్రభావం చూపే మందులను సిఫారసు చేస్తారు. అందుకు భిన్నంగా రైతులు సిఫారసు కంటే ఎక్కువ మోతాదులో వాడుతున్నారు.

వివిధ కారణాలతో..

పిచికారీ చేసిన తర్వాత పంట కోయడానికి కొంతకాలం వేచి ఉండాలి. వివిధ రకాల పంటలను బట్టి ఐదు రోజుల నుంచి 21 రోజుల వరకు కోయకూడదు. వాడకూడదు.

◆ అందుకు భిన్నంగా పిచికారీ చేసిన రెండు, మూడు రోజుల్లోనే కాయగూరలు కోసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పంటలో ఏ రకమైన తెగుళ్లు, పురుగు ఆశించిందో అవగాహన లేక కంపెనీల ఏజెంట్లు ఇచ్చిన నాలుగైదు రకాల మందులు కలిపి పిచికారీ చేస్తున్నారు. వాటికి తగ్గకపోతే వారం, పది రోజుల వ్యవధిలోనే మరోసారి పిచికారీ చేస్తున్నారు.

డబ్బాలపై ఉన్నా..

పురుగుమందు డబ్బాలపై విష పూరిత మందుల ప్రభావం ఎంతుంటుందో రంగుల రూపంలో ఇస్తుంటారు. ఎరుపురంగు అత్యధిక విష పూరిత మందుగా, పసుపు రంగు అధిక విష పూరితం, నీలం రంగు ఓ మోస్తరు, ఆకుపచ్చ కొద్దిపాటి విష పూరితమని ఉంటుంది. ఇవేవీ రైతులు, వ్యాపారులు, కంపెనీ ఏజెంట్లు గుర్తించరూ, పట్టించుకోరు. అందుకే అన్ని రకాల మందులను ఒకే మోతాదులో సిఫారస్ చేస్తున్నారు.



రైతులు గమనించాలి: అరిగేల కిరణ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

రైతులు మోతాదు మించి పురుగు, తెగుళ్ల మందులు వాడకూడదు. తొలిదశలోనే తక్కువ రకం మందులతో అదుపులోకి తేవాలి. జీవ, వృక్ష సంబంధ మందులనే ఎక్కువగా వినియోగించాలి. అత్యవసరమైతేనే రసాయన మందులు వాడాలి.
☛ కూరగాయలు, పండ్లు ఇంటికి తెచ్చిన తర్వాత ఉప్పునీళ్లలో అరగంట నానబెట్టి తర్వాత శుభ్రమైన నీటిలో రెండు, మూడు సార్లు కడిగి వాడాలి. పై తొక్కలను తీసేయడం ద్వారా కొంతమేర అవశేషాలను తొలగించవచ్చు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి


రాజపేటలో వ్యవసాయ క్షేత్రానికి రహదారి నిర్మాణ పనుల్లో ఉపాధిహామీ సాధారణ కూలీలు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా, ప్రత్యేక వైద్యసేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయమై ఉమ్మడి నల్గొండ జిల్లాలోని భువనగిరి, నల్గొండ, సూర్యాపేట జిల్లా ఆసుపత్రుల్లో త్వరలో మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌ల పేరిట వైద్యసేవలు అందుబాటులో తెచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వారంలో రెండు రోజులు ట్రాన్స్‌జెండర్లకు ఓపీ సేవలు అందనున్నాయి.

✤ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ట్రాన్స్‌జెండర్లకు మనోధైర్యం కల్పించేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధి హామీ పని కల్పించాలని భావించింది. ఈ మేరకు శాఖాపరంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ట్రాన్స్‌జెండర్‌కు జాబ్‌కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు ఇటీవలనే విడుదల చేసింది. పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపు ప్రక్రియలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు.

✤ మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటి వరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు కలిగిఉన్న వారు 202 మంది ఉండగా, మరికొందరు ఓటు హక్కు పొందనివారు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరిలో 18 ఏళ్లు నిండినవారికి ఉపాధి హామీ జాబ్‌కార్డును మంజూరు చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు కలిగి ఉన్నవారు..

దేవరకొండ	18
నాగార్జునసాగర్	21
మిర్యాలగూడ	26
నల్గొండ	57
హుజూర్‌నగర్	17
కోదాడ	17
సూర్యాపేట	13
తుంగతుర్తి	7
ఆలేరు	19
భువనగిరి	1
నకిరేకల్	3
మునుగోడు	3

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు ఇవీ..
☛ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు.
☛ గ్రామాల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు.
☛ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించేలా చర్యలు.
☛ పని ప్రదేశంలో వారిపట్ల ఎలాంటి వివక్ష చూపొద్దు. ఇందుకోసం మేట్లకు అవగాహన కార్యక్రమాలు.
☛ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి నియామకం.

గ్రామాల వారీగా గుర్తింపు ప్రక్రియ
– నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, యాదాద్రి భువనగిరి



జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తించే ప్రక్రియ చేపడుతున్నాం. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి, వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా ఇతర కూలీలకు పలు రకాలుగా అవగాహన కల్పించే ఏర్పాట్లు చేపడతాం.

ప్రసాద విక్రయాల్లో మార్పులు?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో నాణ్యతా ప్రమాణాలు కలిగిన ప్రసాదాల తయారీతో పాటు, విక్రయాలలో సరికొత్త మార్పులు తెచ్చే యోచనలో దేవస్థానం ఉంది. రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో దేవుడి ప్రసాదాలను భక్తులకు సునాయాసంగా చేకూరేలా అధునాతన వనరులు కల్పించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయ పరిసరాలలో ఏటీఎం లాంటి ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా భక్తులు తమకు కావాల్సిన ప్రసాదాల టికెట్లను డిజిటల్ పేమెంట్ చేసి, వాటిని పొందే అవకాశం త్వరలోనే అందుబాటులోకి తేనున్నారు. సదరు యంత్రాలను భక్తుల రద్దీ స్థావరాలైన హరి, హర ఆలయాలు, బస్టాండ్, వీవీఐపీ వాహనాల పార్కింగ్, కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపం, పుష్కరిణి, అన్న ప్రసాదం, బస్ స్టేషన్ ప్రాంగణాల్లో కొత్త వనరుల ఏర్పాటుకు ప్రతిపాదించారు.



ప్రసాద విభాగం

ఇప్పటికే..ఒకే సముదాయంలో టికెట్ల విక్రయాలు, ప్రసాదాలను అందజేసే కౌంటర్లు ఉండేవి. సదరు కాంప్లెక్స్‌లో గజిబిజి వాతావరణం ఉండేది. ఆ విధానాన్ని మార్చి టికెట్ కౌంటర్లను ఆలయ ఈవో భాస్కర్‌రావు మరో చోట ఏర్పాటు చేసిన విషయం విదితమే. విక్రయాలలో టికెట్ల కౌంటర్, ప్రసాదాలు అందజేసే కౌంటర్లు వేర్వేరుగా ఏర్పాటయ్యాయి. భక్తులకు అనుగుణంగా మరిన్ని మార్పులు రానున్నాయి.

ప్రమాదం పేరుతో యాపిల్ పండ్లు మాయం!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సిమ్లా నుంచి చెన్నైకి ట్రక్కులో యాపిల్స్‌ను తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగిందని చెప్పి డ్రైవర్లు వాటిని మాయం చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద ఈ నెల 23న చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . హైదరాబాద్ కొత్తపేట పండ్ల మార్కెట్‌లో కందగొండ దత్తాత్రేయ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన సిమ్లాలో భువన్‌సింగ్ అనే వ్యక్తి వద్ద ఈనెల 17న 493 బాక్సుల యాపిల్ పండ్లను కొనుగోలు చేశాడు. వీటి విలువ రూ.15.32లక్షలు ఉంటుంది. వీటిని చెన్నైలో విక్రయించేందుకు కంటైయినర్ ట్రక్కులో తీసుకెళ్తున్నాడు. రవాణా చేసేందుకు ట్రాన్సుపోర్టు కంపెనీకి రూ.1,32,200 చెల్లించాడు. కంటైనర్‌లో పండ్లను తీసుకొని బయలుదేరిన డ్రైవర్లు ఈనెల 23న చౌటుప్పల్ మండలం దండుమల్కాపురానికి చేరుకున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై దండుమల్కాపురం వద్ద ప్రమాదం జరిగిందని, లారీ బోల్తా పడటంతో యాపిల్ పండ్లను ఎత్తుకెళ్లారని డ్రైవర్లు భువన్‌సింగ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పండ్ల వ్యాపారితో పాటు భువన్‌సింగ్ వచ్చి చూడగా కంటైనర్ ట్రక్కుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అక్కడ ఇద్దరు డ్రైవర్లు కూడా కనిపించకుండా పారిపోయారు. వారికి ఫోన్ చేస్తే చరవాణి స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు వీటిని మాయం చేసి ఉంటారని అనుమానంతో పండ్ల వ్యాపారి దత్తాత్రేయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు.

కూచిపూడి నాట్య ధీరుడు..
ఈ కుర్రోడు!

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: తపన ఉండాలే కానీ మనిషనుకుంటే ఏదైనా చేసేయగలడు. వాటికనుగుణంగానే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తమకంటూ ఓ రంగంపై ఆసక్తి, పట్టుదలను ఏర్పరచుకుంటారు. తల్లిదండ్రులు, గురువులు వాటిని గుర్తించి తగు శిక్షణ ఇప్పిస్తే ఆ రంగంలో ఆరితేరుతారు. ఇలా తమలోని అభిరుచిని పసిగట్టిన పోషకులు అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ప్రదర్శనలు చేసి ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు పొందుతున్నాడు మండలంలోని నాగార్జునపేటతండాకు చెందిన ఆంగోతు శివకుమార్.

ఇష్టం పెరిగిందిలా..

☛ ఆంగోతు బిక్కు, శాంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శివకుమార్. తన ప్రాథమిక విద్య నాగార్జునసాగర్‌లో పూర్తిచేశాడు. అక్కడ జరిగే సంస్కృతి కార్యక్రమాలలో నృత్యాలను చూసి నాట్యమంటే ఇష్టం పెంచుకున్నాడు.

☛ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నాగార్జునసాగర్‌లోని నాట్యశిక్షకుడు దస్తగిరి వద్ద కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. 2006లో హాలియాలోని సైన్స్ ఫేర్ కార్యక్రమంలో అప్పటి కలెక్టర్ ముందు కూచిపూడి నృత్యం చేసి ప్రశంసలు పొందాడు.

☛ తన తండ్రి వ్యవసాయ కూలీ అయినా శివకుమార్ కోసం హైదరాబాద్ వెళ్లి ఆటో నేర్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ కుమారుడిని సికింద్రాబాద్‌లోని రాంకోటిలో శ్రీత్యాగరాజ మ్యూజిక్ కళాక్షేత్రంలో చేర్పించారు.

☛ అక్కడ శివకుమార్ ప్రతిభను గుర్తించిన భరతనాట్య కళాకారుడు విజయ్ సొంత ఖర్చులతో చెన్నై వెంకట చినసత్యం కూచిపూడి ఆర్ట్ అకాడమీలో చేర్పించారు.

☛ అక్కడ వెంపటి శ్రీమోయి వద్ద ఏడాదిన్నర పాటు కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. నృత్యంలో అందరినీ ఆకట్టుకునే విధంగా భంగిమలతో తన కళ్లతోనే భావాలను పలికిస్తూ తన నృత్యంతో కట్టిపడేసేవాడు.

☛ అక్కడి నుంచి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని శివాన్స్ డాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి నాలుగు అకాడమీలలో 200పైగా విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నాడు. దీనితో పాటు చిరంజీవి నటించిన ఆచార్య మూవీలో హీరోయిన్ కాజల్, సంగీతకు కూచిపూడి నాట్యంలో మెలకువలు నేర్పించారు.


నాట్యం చేస్తున్న శివకుమార్

అవార్డులు, ప్రశంసలు..
◆ సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో నాట్య చిరోదామి, వరంగల్‌లో నిర్వహించిన పోతన శక్తిపీఠంలో మొదటి బహుమతి రాధేశ్యాం మాష్టారు చేతుల మీదుగా నాట్య కళాధీర అవార్డు, నాట్య నర్తక, నాట్య మయూరి అవార్డులను గెలుపొందాడు.
◆ శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, శ్రీకాళహస్తి, మహారాష్ట్రలోని వరలక్ష్మి దేవాలయం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శ్రీత్యాగరాజ గాన సభ, తెలంగాణ ప్రభుత్వ వజ్రోత్సవ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు.

బిస్మిల్లాఖాన్ అవార్డు సాధిస్తా..
– ఆంగోతు శివకుమార్, నాగార్జునపేట, తిరుమలగిరిసాగర్

ఎప్పటికైనా మంచి గురువుగా, నాట్యకళాకారుడిగా పేరు సంపాదించి బిస్మిల్లాఖాన్ అవార్డును సాధిస్తా. ప్రభుత్వ నాట్య కళాశాలలో గురువుగా విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాను.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరు మిత్రులు మృతి చెందారు. ఈ ఘటన నల్గొండ జిల్లా మునుగోడు మండలం చొల్లేడు గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడుకు చెందిన నాగరాజు(19) ద్విచక్ర వాహనంపై చొల్లేడు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు(23) తన స్నేహితుడు బొమ్మగోని నరేశ్‌తో కలిసి నల్గొండకు వెళ్లి వస్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజు, రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


నాగరాజు


రామాంజనేయులు

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00


సందర్శనకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు

శిక్షణ అధికారుల బృందం సందర్శన

కట్టంగూరు, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మేనేజ్' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై అధ్యయనానికి వచ్చిన ఆఫ్రికా ఖండం, వ్యవసాయ రంగానికి చెందిన అధికారుల బృందం.. మండలంలోని అయిటిపాముల రైతు ఉత్పత్తి దారుల సంఘ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించింది. కేంద్రంలోని నిమ్మకాయల గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మకాయలతో ఒరుగుల తయారీ విధానాన్ని పరిశీలించారు. సోలార్‌తో పనిచేసే నిల్వ కేంద్రాన్ని, నర్సరీలో కూరగాయల మొక్కల పెంపకాన్ని చూశారు. కేంద్రం పనితీరును, జరుగుతున్న అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను అక్కడి సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోణం సందీప్ వివరించారు. రైతుల అభివృద్ధికి కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సును మేళవించి 'కృషి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సందీప్ తెలిపారు. కేంద్రం ఛైర్మన్ సైదమ్మ పాల్గొన్నారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

అంతర్జాలంలో సమాచారం నమోదు

చిలుకూరు, న్యూస్‌టుడే: సాంకేతిక లోపం కారణంగా అంతర్జాలంలో నమోదు కాకపోవడంతో చిలుకూరు మండల పరిధిలోని చిలుకూరు, బేతవోలు, నారాయణపురం(పాలెఅన్నారం) ప్యాక్స్‌లలో రుణమాఫీ రాని 150 మంది రైతులకు ఊరట కలగనుందని ఆ సంఘ సీఈవోలు బత్తిని కన్నయ్య, చిలువేరు లక్ష్మీనారాయణ, గండ్ర పూర్ణ తెలిపారు. శుక్రవారం ఆ రైతులకు సంబంధించిన సమాచారాన్ని నల్గొండలోని సహకార బ్యాంక్(టెస్కాబ్)లో అంతర్జాలంలో నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల మేరకు రుణమాఫీ వస్తుందన్నారు.

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ ఇరువైపుల చెత్త, వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. వెంటనే వాటిని తొలగించాలి. – శివలాల్, బాలాజీనగర్

✔ పరిశీలించి వెంటనే చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం. – యాదగిరి, పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

గరిడేపల్లి, న్యూస్‌టుడే:

? కొత్తగా కల్మల్‌చెరువు రోడ్డు రెండు వరుసలు చేస్తూ పాత రోడ్డులో ఒకవైపు ఎక్కువగా, మరో వైపు తక్కువగా కొలతలు తీసి కంకర పోశారు. దాంతో కొందరికి అన్యాయం జరుగుతోంది. – ఓరుగంటి శ్రీనివాస్, గరిడేపల్లి

✔ డీఈ వచ్చి సమస్యను పరిశీలించి కొలతలు చూసి పరిష్కరిస్తారు. – సీతారామయ్య, ఈఈ ఆర్‌అండ్‌బీ, సూర్యాపేట

ఎక్సైజ్ దాడులు, పలువురిపై కేసులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడుంబా తయారు చేసినా, క్రయ, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పలుచోట్ల దాడులు చేసి వివరాలను శుక్రవారం తెలిపారు. మఠంపల్లి మండలం కొత్త తండాకు చెందిన బాణోతు లక్ష్య, శైలజలు ద్విచక్రవాహనంపై సారా తరలిస్తుండగా మీగడంపాడు తండా వద్ద పటుకున్నామని, పాలకవీడు మండలం కల్మెట్ తండాకు చెందిన బద్య ద్విచక్రవాహనంపై 8 లీటర్ల సారాయిని తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకొని సారాను, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

సంఘ అభివృద్ధికి కృషి

చిలుకూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఛైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. బేతవోలు ప్యాక్స్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమష్టి కృషితోనే సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. సంఘంలో సిబ్బంది పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అవినీతి జరుగుతుందని పలువురు రైతులు సమావేశంలో ఆరోపించారు.

29న చదరంగ పోటీలు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఆదివారం బాల బాలికలకు జిల్లాస్థాయి చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు చదరంగ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురాం: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ఫ్లెక్స్:** దేవర, రంగా: సత్యం సుందరం

పెచ్చులూడి.. చువ్వలు తేలి



మునగాల, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ అంతగా కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సౌకర్యాల లేమి ఇందుకు నిదర్శనం. మండలంలోని తిమ్మారెడ్డి గూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాల తరగతి గదులతో పాటు, వరండా పై కప్పు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలాయి. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చేసేది లేక ఉపాధ్యాయులు చెట్ల కిందనే పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, నిధులు మంజూరు కాగానే నూతన భవన నిర్మాణం చేపడతామని ఎంఈవో సలీం షరీఫ్ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక



మునగాల, న్యూస్‌టుడే: కొక్కిరేణి గ్రామంలోని రెండో వార్డులో విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో, చుట్టూ పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా ఉంది. నిత్యం రైతులు ట్రాక్టర్లపై పొలాలకు, పశువులు మేతకు, చిన్నారులు ఆడుకోవడానికి సమీపంలోకి వెళ్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు భయపడుతున్నారు. వెంటనే నియంత్రిక ఎత్తు పెంచి, చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్తు ఏఈ వికాస్ ఈ సమస్యపై స్పందిస్తూ నియంత్రికను పరిశీలించి రక్షణ కంచెను ఏర్పాటు చేస్తామన్నారు.

అధికారులు స్పందించరు.. ఇబ్బందులు గమనించరు

మఠంపల్లి, న్యూస్‌టుడే:

మిషన్ భగీరథ అధికారుల ఉదాసీన వైఖరి మఠంపల్లి గ్రామస్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇక్కడి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై శ్రీకాంతాచారి కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై నెల రోజుల క్రితం డీఐ పైపుల మరమ్మతుల కోసం పెద్ద గుంత తవ్వి ఆ మట్టిని అక్కడే పోశారు. పనులు పూర్తయ్యాక గుంతను పూడ్చించక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మధ్యలో మట్టి కుప్ప, మరో వైపు పెద్ద గుంత ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు ఎటు వెళ్లాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఇక్కడి నుంచే నిత్యం విద్యార్థులు జడ్పీ ఉన్నత పాఠశాలకు, పింఛన్ల కోసం వృద్ధులు, ఇతర అవసరాల కోసం గ్రామస్థులు తపాలా కార్యాలయానికి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులకూ రైతులు ట్రాక్టర్లపై ఈ రహదారిపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఇంత మంది యాతన పడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ ఏఈ జయచంద్ర మాట్లాడుతూ మరమ్మతులు పూర్తయ్యాయని, త్వరలో గుంతను పూడ్చిస్తామని చెప్పారు.

రహదారిపై తవ్వి వదిలేసిన గుంత, అడ్డుగా పోసిన మట్టి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



నేరేడుచర్ల విజయ దుర్గ ఆలయంలో ఆలయ అర్చకుడు మొలుగు శ్రీనివాసాచార్యులు శుక్రవారం అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణ జరిపి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

'నష్టపోయినా సాయం అందడం లేదు'

కోదాడ న్యూస్‌టుడే: ప్రభుత్వ సాయం అందలేదని వరద బాధితులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కూచిపూడి గ్రామంలో చాలా మంది ఇళ్లల్లోకి నీరు వచ్చి భారీ నష్టం వాటిల్లిందని, అయినా సాయం అందలేదని వాపోయారు. అనర్హులకు సాయం అందడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. భారాస మండల కార్యదర్శి సురేశ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వరద బాధితులు

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల్ని పరిష్కరించాలి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి పద్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, ఉపాధి హామీ పథకం, పశువైద్యం, ఐసీడీఎస్ అధికారులు వారి పరిధిలో చేపట్టిన పనులు, కార్యక్రమాల గురించి వివరించారు.

తహసీల్ కార్యాలయ ఖాళీ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ బానోతు అచ్చాలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: తహసీల్ కార్యాలయ ఖాళీ స్థలం విక్రయించేందుకు కోర్టు సిబ్బంది స్థల పరిశీలన చేశారు. ఒక సివిల్ కేసులో బాధితుడికి ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారం చెల్లించకపోవడంతో ఆ పరిహారం వసూలు నిమిత్తం తహసీల్ కార్యాలయంలో ఖాళీ స్థలాన్ని అమ్మి బాధితుడికి పరిహారం చెల్లించాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా శ్యామ్‌కుమార్ ఆదేశాలు ఇచ్చినట్లు సంగతి తెలిసిందే. శుక్రవారం 100 గజాల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ బానోతు అచ్చాలు ప్రదేశాన్ని పరిశీలించి కొలతలు కొలిచి హద్దులు నిర్ణయించారు. న్యాయస్థానం ఫీల్డ్ అసిస్టెంట్ అచ్చాలు స్థల పరిశీలన నివేదికను న్యాయమూర్తికి అందిస్తారు. స్థలాన్ని కోర్టు బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

తొలిరోజు.. కబడ్డీ పోటీలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నలో జరుగుతున్న డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో తొలిరోజు జరిగిన అండర్-17 బాలికల కబడ్డీలో మఠంపల్లి మండల జట్టు ప్రథమ స్థానం, హుజూర్‌నగర్ మండల జట్టు ద్వితీయ స్థానం, బాలుర కబడ్డీలో హుజూర్‌నగర్ మండల జట్టు ప్రథమ, మఠంపల్లి మండల జట్టు ద్వితీయ స్థానం పొందినట్లు పెంచికల్‌దిన్న జడ్పీహెచ్‌ఎస్ హెచ్.ఎం. ఎల్.శ్రీనివాసరావు తెలిపారు. విజేతలకు ట్రస్టు ఛైర్మన్ వల్లంశెట్ల లచ్చయ్య, మాజీ సర్పంచి సుంకర క్రాంతికుమార్ బహుమతులు అందజేశారు.

అక్టోబరు 1న బహుమతుల అందజేత

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా స్థానిక పెన్షనర్స్ భవన్‌లో క్రీడాపోటీలను జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, పెన్షనర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య ప్రారంభించారు. కోదాడలో క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన విజేతలకు అక్టోబరు ఒకటిన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వయో వృద్ధుల జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్ తదితరులున్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, పెన్షనర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్యలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందడంతో పాటు మరో ముగ్గురికి గాయాలైన ఘటన మునగాల మండలం మాధవరం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడలోని విద్యాధరపురానికి చెందిన నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి విజయవాడకు బొలేరో వాహనంలో వెళ్తున్నారు. మాధవరం వద్ద వాహనం అదుపు తప్పి జాతీయ రహదారి వెంట ఉన్న ఇనుప గ్రిల్స్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న రాంబాబు(60) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న రోషిబాబు, క్రాంతికుమార్, రమణలకు గాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. శవపరీక్ష నిమిత్తం రాంబాబు మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో రేషన్ డీలరు..

మోతె, న్యూస్‌టుడే: గుండెపోటుతో రేషన్ డీలరు మృతిచెందిన ఘటన మండలంలోని తుమ్మగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. సంబంధిత అధికారులు తనిఖీకి వస్తున్నారని సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన కొడకండ్ల రాంరెడ్డి(65) రేషన్ దుకాణం వద్దకు వెళ్లి బియ్యం బస్తాలు సరిచూసుకుంటూ గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మరణం పట్ల మండల రేషన్ డీలర్ల సంఘం సంతాపం తెలిపింది.

అర్హులకు రుణమాఫీ వర్తించలేదని రైతుల ఆందోళన

నడిగూడెం, న్యూస్‌టుడే: అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించకుండా, బినామీ పేరుతో రుణాలు తీసుకున్న వారికి ఎలా వచ్చిందని శుక్రవారం తెల్లబల్లిలో నిర్వహించిన సర్వజన సభలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్యాక్స్‌లో 43 మంది రైతుల పేరుతో వారికి తెలియకుండా రుణాలు తీసుకున్నారని, తిరిగి చెల్లించాలని ప్యాక్స్ పాలకవర్గం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వారిలో కొంత మంది రైతులు తాము రుణం తీసుకోలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఇదే జాబితాలో ఉన్న ఒక రైతుకు రుణం లేదని ధ్రువపత్రం జారీ చేశారని, తనఖా భూములను సైతం విడిపించారని, మిగతా రైతులకు ఎందుకు వర్తింపజేయలేదని రైతులు ప్రశ్నించారు. సంఘంలో 907 మంది రైతులు రుణమాఫీకి అర్హులు, వీరిలో 507 మందికి మాఫీ వచ్చినట్లు సీఈవో ప్రభాకర్‌రావు తెలిపారు. తమ పేరున రుణమాఫీ వచ్చినా ఎందుకు అమలు చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. సభకు ప్యాక్స్ ఛైర్మన్ బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, వైస్ ఛైర్మన్ కొల్లు వీరయ్య, సీఈవో ప్రభాకర్‌రావు, డైరెక్టర్లు స్థానిక రైతులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

వినతి.. నేరేడుచర్ల: ధరణి ఆపరేటర్లకు ఏడు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఆ సంఘం నాయకుడు గణేశ్ శుక్రవారం తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు.

అనంతగిరి: రాజకీయాలకు అతీతంగా వరద బాధితులకు సాయం అందించాలని భారాస మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అన్నారు. చనుపల్లి, గొండ్రియాల, కిష్టాపురం, కొత్తగూడెం గ్రామాల్లో అధికారులు సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు సాయం అందించలేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

పంపిణీ.. చిలుకూరు: బీసీ బాలుర వసతి గృహంలోని పిల్లలకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు, శక్తియువజన వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు తన తల్లి నారమ్మ జ్ఞాపకార్థం దుస్తులు, సంచులను శుక్రవారం పంపిణీ చేశారు.

అందజేత.. నడిగూడెం: సాయిబాబా మందిరానికి సిరిపురం శ్రీ కోదండరామస్వామి దేవస్థాన పూజారి చక్రధరాచార్యులు పంచ నక్షత్రహారతి ప్లేటును బహూకరించారు. మందిర పూజారి నక్షత్ర హారతులను బాబాకు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతను సాయి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

గోడపత్రిక విడుదల.. నేరేడుచర్ల: నేరేడుచర్లలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ మహాసభల గోడ పత్రికలను నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు.

కేసు.. నడిగూడెం: చాకిరాల వద్ద జూద స్థావరంపై శుక్రవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.అజయ్‌కుమార్ తెలిపారు. రూ.2,050 నగదు సీజ్ చేశామన్నారు.

ఆహ్వానం.. హుజూర్‌నగర్: వచ్చే నెల 27న జరిగే మహా రుద్రాభిషేకం ఆహ్వాన పత్రాలను పట్టణ ప్రముఖులకు, అధికారులకు కమిటీ సభ్యులు అందజేశారు.

బీసీలకు న్యాయం జరగడం లేదు.. హుజూర్‌నగర్ గ్రామీణం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడం లేదని, స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా చట్టసభల్లో వాటా కోసం నేటికీ ఉద్యమించాల్సి రావడం దురదృష్టకరమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు శుక్రవారం అన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం.. కోదాడ: అక్రమంగా తరలిస్తున్న మద్యంను పోలీసులు పలు కేసుల్లో పట్టుకున్నారు. ఇలా పట్టుబడిన 25 కేసుల మద్యాన్ని శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము, ఎక్సైజ్ సీఐ శంకర్‌లు ధ్వంసం చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో గోదాముల్లో నిల్వ ఉన్న మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

నియామకం.. కోదాడ పట్టణం: కోదాడ షెడ్యూల్ కులాల అభివృద్ధి సహాయ అధికారిగా బి.రుక్మిణికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నియామక ఉత్తర్వులు అందించారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వసతి గృహ అధికారులు ఆమెను సన్మానించారు.

ప్రమాణ స్వీకారం.. చిలుకూరు: బేతవోలులోని పురాతన శ్రీసీతారామచంద్రా స్వామి దేవాలయ నూతన కమిటీని ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా వీరస్వామి, కమిటీ సభ్యులుగా లక్ష్మి, వెంకటలక్ష్మి నరసింహారావు, బ్రహ్మారెడ్డి, వేణు, నాగేశ్వరరావు, రాంబాబులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు.

ప్రారంభం.. నేరేడుచర్ల: పెంచికల్‌దిన్న జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ డివిజన్ స్థాయి బాలికల అండర్-17, 14 విభాగాల బాలబాలికల కబడ్డీ పోటీలను పురపాలిక ఛైర్మన్ ప్రకాశ్ ప్రారంభించారు.

విద్యార్థి పోరాటాలకు స్ఫూర్తి భగత్ సింగ్.. మునగాల: విద్యార్థి పోరాటాలకు స్ఫూర్తి భగత్ సింగ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి సీహెచ్ సీతారాం అన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, చందు, వికాస్ పాల్గొన్నారు.

ఎన్నిక.. మేళ్లచెరువు: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, రెహనా బేగం, కోశాధికారిగా వీరయ్యలను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు జరపాలి: సీపీఎం

మోతె, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి నెలలు గడుస్తున్నా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. తుమ్మలపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామశాఖ మహాసభకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి రిజర్వేషన్లు ఖరారు చేసి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాలకు సర్పంచులు లేక ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని, వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నా ఆదుకునే వారు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, పిచ్చయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పేదల కోసం నిరంతర పోరాటం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసిన గొప్పనాయకుడు దాసరి రామకృష్ణ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, పోటు ప్రసాద్ అన్నారు. కల్మల్‌చెరువులో సీపీఐ సీనియర్ నాయకుడు సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ రామకృష్ణ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని పార్టీకి, పేదలకు సేవ చేశారని, ఆయన సేవలను కొనియాడారు. అంతిమయాత్రలో మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, జిల్లా, రాష్ట్ర సమితి నాయకులు వెంకటేశ్వర్లు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్విజ్ విజేతలు తేజ విద్యార్థులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లాస్థాయి పర్యాటక ప్రాంతాలపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో కోదాడ తేజ విద్యాలయ తొమ్మిదో తరగతి విద్యార్థులు అన్నపురెడ్డి హరిహరకుమార్‌రెడ్డి, నోముల సృజన్‌గుప్తా, 8వ తరగతి విద్యార్థి నితీష్‌రాజ్‌ల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమా, డైరెక్టర్ సోమిరెడ్డిలు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందడంతో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ సమక్షంలో కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్నారని పేర్కొన్నారు. విజేతలను అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు

కరివిరాలలో తాగునీటి ఇబ్బందులు

నడిగూడెం, న్యూస్‌టుడే: కరివిరాలలో గత మూడు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు తాగునీటి మోటార్లు పనిచేయకపోవడంతో నల్లాల నుంచి నీరు రావడం లేదని, ట్యాంకర్ల ద్వారా తాగునీరు పట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటార్లకు విద్యుత్తు సరఫరా చేసే నియంత్రిక కాలిపోయినా పట్టించుకోకపోవడంతో మోటార్లు పనిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తాగునీటి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఎంపీవో విజయకుమారిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రైతుల వ్యవసాయ మోటార్లకు సంబంధించిన నియంత్రిక నుంచి మోటార్లకు విద్యుత్తు సరఫరా అవుతుందని, నియంత్రిక కాలిపోవడంతో వెంటనే తరలించామని, మరో నియంత్రిక అందుబాటులో లేక ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం ఒక మోటారు పనిచేస్తుందని, శనివారం వరకు నియంత్రికను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్తు సామగ్రి చోరీ.. తరలిస్తుండగా పట్టివేత

కోదాడ, న్యూస్‌టుడే: విలువైన విద్యుత్తు సామగ్రిని ఇద్దరు దుండగులు అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్న ఘటన నల్లబండగూడెం పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన నామాల వీరబాబు, గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన దాసరి వంశీ కలిసి తొగర్రాయి సబ్‌స్టేషన్‌లో భద్రపరచిన విద్యుత్ నియంత్రికల సామగ్రి, వైర్లు దొంగలించి సొమ్ము చేసుకోవాలని పథకం రచించారు. దీనిలో భాగంగానే సబ్ స్టేషన్‌లోకి చొరబడి సామగ్రిని చోరీ చేసి, విక్రయించేందుకు ఆటోలో విజయవాడకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని, వరదల నేపథ్యంలో విద్యుత్ మరమ్మతుల కోసం తీసుకొచ్చిన సామగ్రిని చోరీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ ఏడీఈ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

కార్యకర్తలకు అండగా భారాస: ఒంటెద్దు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. మంగాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నాగరాజు కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 లక్షల చెక్కును అందించారు. మార్కెట్ మాజీ ఛైర్మన్ వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ, సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న భారాస నాయకులు

సున్నపురాయి గనుల్లో పేలుడు పదార్థాలు స్వాధీనం?


మఠంపల్లి, న్యూస్‌టుడే: గుండ్లపల్లి-రఘునాథపాలెం గ్రామాల మధ్య ఉన్న గనుల్లో సున్నపురాయిని అక్రమంగా కొందరు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్బీ పోలీసులు తవ్వకాలకు ఉపయోగించే పేలుడు పదార్థాలను వారి నుంచి స్వాధీనం చేసుకుని మఠంపల్లి ఠాణాలో అప్పగించినట్లు తెలిసింది. చాలా కాలంగా ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగానే తమ ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

స్వచ్ఛతలో అందరి భాగస్వామ్యం అవసరం

కోదాడ(బాలాజీ నగర్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పుర ఛైర్‌పర్సన్ ప్రమీల అన్నారు. బాలాజీ నగర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మోతె: స్వచ్ఛత కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ వరహాలు అన్నారు. సిరికొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

లక్ష్మణ్ బాపూజీ అందరికీ స్ఫూర్తి



మేళ్లచెరువులో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘ సభ్యులు

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

☛ లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడని పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మార్కండేయ అన్నారు. నేరేడుచర్ల ప్రధానకూడలి వద్ద సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



కోదాడలో శంకుస్థాపన చేస్తున్న పుర ఛైర్‌పర్సన్ ప్రమీల, నాయకులు

☛ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పుర ఛైర్మన్ సామినేని ప్రమీల అన్నారు. కోదాడలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో అర్పించారు. అనంతరం ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో ఆయన విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

– న్యూస్‌టుడే బృందం:

బాధ్యతల స్వీకరణ

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం మండల విద్యాధికారిగా బి.ఉపేందర్‌రావు శుక్రవారం నడిగూడెం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది గురుస్వామి, రామారావు, గోవర్ధన్, తదితరులు అభినందించారు.

అనంతగిరి: మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో)గా తల్లాడ శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఖానాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

పిల్లలమర్రి(సూర్యాపేట నేరవిభాగం), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం త్రీటౌన్ కార్యదర్శి మేకనబోయిన శేఖర్ అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రిలో సీపీఎం శాఖ మహా సభను సైదులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం పేదలపై భారం మోపుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని ఆరోపించారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం తీగల లింగయ్యను శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, గంగమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

హెచ్‌బీటీలకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతి

నాగారం, న్యూస్‌టుడే: తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు (హెచ్‌బీటీ)లను ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో నియమించాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు ఆధ్వర్యంలో పాఠశాల అదనపు డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌బీటీలు మనోహర్, రాజకుమారి, లావణ్య, గజానందం, సురేశ్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

చివ్వెంల, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ ఎమ్మెల్యే, లయన్స్‌క్లబ్ ఛైర్మన్ దోసపాటి గోపాల్, చివ్వెంల పీఏసీఎస్ ఛైర్మన్ మారినేని సుధీర్‌రావు అన్నారు. మండలంలోని బండమీది చందుపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ మాజీ ఛైర్మన్ నూకల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాతపుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామగ్రి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో కళారాణి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రీజినల్ ఛైర్మన్ గుడిపూడి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, నవీన్, రవీందర్‌రెడ్డి, శబరీనాథ్, వంశీ, వెంకన్న, నగేశ్, రమేశ్, రాజు పాల్గొన్నారు.



చందుపట్ల పాఠశాలలో విద్యార్థులకు రాతపుస్తకాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ఛైర్మన్ దోసపాటి గోపాల్

30న పీడీఎస్‌యూ డివిజన్ సభ

నూతనకల్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిరుమలగిరిలో ఈనెల 30న నిర్వహించే డివిజన్ స్థాయి సభను జయప్రదం చేయాలని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ కోరారు. నూతనకల్‌లో ఆ సంఘం ప్రతినిధులతో కలిసి కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అనిల్, శివ, మణి, రమేశ్, రాజ్ పాల్గొన్నారు.



నూతనకల్‌లో సభ కరపత్రాలు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్

ప్రమాదకరంగా కుంట

రామన్నగూడెంతండా ప్రాథమిక పాఠశాల పక్కనే పెద్దనీటి కుంట ఉంది. అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులు కుంటలోకి దిగి ఎక్కడ ప్రమాదాల బారిన పడతారోనని తల్లిదండ్రులు భయాందోళనన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుంట చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 'త్వరలో సమస్యను పరిష్కరిస్తామ'ని ఎంపీడీవో శేషుకుమార్ తెలిపారు.



– తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే

సీసీ ధ్వంసమై.. గుంతలు ఏర్పడి

సూర్యాపేటలోని గణేశ్‌నగర్‌లో సీసీ రహదారులు అధ్వానంగా మారాయి. కంకర తేలి, గుంతలు పడటంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నిరాశ్రయుల కేంద్రానికి వెళ్లే రోడ్డును తవ్వడంతో కంకర లేచి ధ్వంసమైంది. ఇక్కడి నుంచి ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. పాదచారులకు గుంతలు కనిపించక కిందపడుతున్నారు. వాహనదారులు కూడా దగ్గరకొచ్చే వరకు గుంతలు కనిపించకపోవడంతో ఒకేసారి ఆగాల్సి వస్తోంది. దీంతో వాహనాలపై వెనకాల కూర్చున్న వారు ఎగిరి కిందపడుతున్నారు. 'రహదారులను పరిశీలించి మరమ్మతు చేపడతామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.



భానుపురి, న్యూస్‌టుడే

కట్టెల వంట.. కళ్లకు మంట



తరచూ కురుస్తున్న వర్షాలతో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం వండే నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సరైన వంట గదులు లేక చెట్ల కింద, కొన్ని చోట్ల ఉన్నా చిన్నగా ఉండటంతో పొగతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ముసురు కురిసిన రోజుల్లో బండరామారం ప్రాథమిక పాఠశాలలో చిన్న గదిలో వంట చేస్తూ పొగతో ఇబ్బంది పడుతూ 'న్యూస్‌టుడే' కంటపడింది. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు ఉమను వివరణ కోరగా వర్షం వచ్చిన సమయంలో కట్టెలు తడిసి వంట చేయడం ఇబ్బందిగా ఉంది. గ్యాస్ సౌకర్యం ఏర్పాటు అనేది ప్రభుత్వ నిర్ణయంపైన ఆధారపడి ఉందన్నారు.

– తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే

కంకర తేలి.. కంపచెట్లు అల్లుకొని

తాళ్లసింగారం-మల్లన్నదేవుడితండా రోడ్డు పంచాయతీరాజ్‌శాఖ రోడ్డు పరిధిలోకి చేర్చకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. సుమారు 2 కి.మీ. పొడవు కలిగిన ఈ రోడ్డు పాలేరు ఏటివరకు విస్తరించి ఉంది. పదేళ్ల క్రితం ప్రత్యేక నిధులతో కంకరరోడ్డుగా మార్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ తర్వాత పట్టించుకోవడం మానేశారు. దీంతో కంకరతేలి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. ఈ బాట వెంట నిత్యం రైతులు, తండావాసులు వెళ్తుంటారు. ఉపాధిహామీ పథకం కింద చెట్లను తొలగించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. రోడ్డు ఆధునికీకరణ చర్యలు తీసుకుంటామని గ్రామపంచాయతీ కార్యదర్శి సుధాకర్‌గౌడ్ 'న్యూస్‌టుడే'కు వివరించారు.



నూతనకల్, న్యూస్‌టుడే

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని చర్చికాంపౌండ్ నుంచి విజయవాడకు వెళ్లే మార్గంలో విద్యుత్తు నియంత్రిక వద్ద దట్టంగా ముళ్లచెట్లు పెరిగాయి. చుట్టూ రక్షణ కంచె లేదు. –రాము, సూర్యాపేట

✔ మొక్కలను తొలగించి రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తాం. –సురేష్, విద్యుత్తు ఏఈ, సూర్యాపేట పట్టణం–1

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఎస్.వి.ఎస్ కాలనీలో మురుగు కాల్వలు నిర్మించలేదు. ఖాళీ స్థలాల్లో వ్యర్థజలాలు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. –ప్రభాకర్, ఎస్.వి.ఎస్.కాలనీ

✔ నిధుల లభ్యతను బట్టి నిర్మాణం చేపడతాం. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి పురపాలిక పరిధిలో సూర్యాపేట-జనగామ ప్రధాన రహదారిపై కృష్ణవేణి పాఠశాలకు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. –బి.నగేశ్, తిరుమలగిరి

✔ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. ఎం.బుచ్చిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్, తిరుమలగిరి పురపాలిక

ఆలోచన బృహత్తరం..


అమలులో నిర్లక్ష్యం

సూర్యాపేట పట్టణంలోని నివాస గృహాలు





సూర్యాపేట: కొత్త మార్కెట్ దారి నుంచి ఖమ్మం రోడ్డు వరకు విస్తరణకు నోచుకోని 60 ఫీట్ల రహదారి



పిల్లలమర్రి(సూర్యాపేట పురపాలిక), న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలికలో బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) అమలుకు నోచుకోవడం లేదు. 2022 అక్టోబరులో అమలుకు శ్రీకారం చుట్టినా నేటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. విలీన గ్రామాలను కలిపి సర్వే చేసి మ్యాపును రూపొందించి రెండేళ్లు దాటినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అమలుకు చర్యలు తీసుకుంటాం

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

సూర్యాపేట పురపాలికలో బృహత్తర ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకుంటాం. గతంలో సర్వే నిర్వహించిన విషయమై ఉన్నతాధికారులకు వివరిస్తాం. వారి నుంచి ఆదేశాలు రాగానే అమలుపరుస్తాం.

పారిశ్రామిక కాలనీలో ఇబ్బందులు

పారిశ్రామిక పరిధిలో పలు కాలనీలో ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న వారు నిర్మించుకున్న ఇళ్లకు, కొత్తగా గృహాల నిర్మాణానికి అనుమతులు రావడం లేదు. వీరు బ్యాంకుల్లో రుణాలు, ఇతర అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణాలు అందక ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బృహత్తర ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కానరాని వసతులు

సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత నలువైపులా ఇళ్ల నిర్మాణాలు పెరిగి కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దురాజ్‌పల్లి, పిల్లలమర్రి, బీబీగూడెం, కుడకుడ, కుప్పిరెడ్డిగూడెం, కుసుమవారిగూడెం, గాంధీనగర్, భాషానాయక్‌తండా, రాయినిగూడెం గ్రామాలను 2018లో గత ప్రభుత్వం సూర్యాపేట పురపాలికలో విలీనం చేసింది. నేటికీ సరైన వసతులు కల్పించలేదు. బృహత్తర ప్రణాళిక అమలుతో సౌకర్యాలు సమకూరుతాయని సంతోషపడిన ప్రజలకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా రహదారుల సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) అమలైతే మున్సిపాలిటీని జోన్లుగా విభజిస్తారు. వాణిజ్య జోన్‌లో నిర్మాణాలు చేపట్టి పన్నులు వసూలు చేస్తారు. దీంతో మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరుతుంది.

విద్యార్థుల ప్రతిభ

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో అర్వపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారు. వక్తృత్వ పోటీలో శ్రావ్యకు ప్రథమ, వ్యాసరచన పోటీలో చరణ్ ద్వితీయ బహుమతి సాధించడంతో వారికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు.



సూర్యాపేటలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థిని శ్రావ్య

చలో హైదరాబాద్ జయప్రదానికి పిలుపు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనాలు పెంచాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్ నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు అన్నారు. అర్వపల్లిలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ బోధనేతర సిబ్బంది సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ఎల్లమ్మ, మానస, స్వప్న, సంధ్య, మమత పాల్గొన్నారు.

నూతనకల్: కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ అధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్ నిర్వహించనున్న మహాధర్నా, ర్యాలీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం నూతనకల్‌లో సిబ్బందితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, లలిత, సునంద, మంజులమ్మ, కవిత, ప్రమీల పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: శ్రీఅఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో గతవారం రోజులుగా గ్రామ దేవాలయ అర్చక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ అర్చక శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణ తీసుకున్న అర్చకులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన స్వామి, లక్ష్మయ్య, శ్రీనివాస్, నరేష్, వికాస్‌పాండే పాల్గొన్నారు.



తిమ్మాపురంలో శ్రీసూర్యక్షేత్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న అర్చకులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రత్యేక పూజలు.. సూర్యాపేట సాంస్కృతికం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయంలో అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అర్చన, అష్టోత్తర శతనామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

29 నుంచి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: సూర్యాపేటలోని అంజనాపురి కాలనీలో ఈనెల 29, 30తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.కరుణాకర్‌రెడ్డి, మేకవంశీ పిలుపునిచ్చారు. మండలంలోని పాతర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జిల్లా మహాసభకు సంబంధించిన గోడపత్రికను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటయ్య ఆవిష్కరించారు. మహాసభకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు లింగస్వామి, అంజయ్య, శ్రీహరి, రామచంద్రయ్య పాల్గొన్నారు.



పాతర్లపహాడ్‌లో టీఎస్‌యూటీఎఫ్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చేస్తున్న ప్రభుత్వం పేదలకు ముందుగా పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని అనాజీపురం, దోసపహాడ్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పార్టీ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు, చెరువు స్థలాలు, నాలాలను ఆక్రమించి కట్టిన పెద్దల భవనాలను కూల్చివేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పురపాలికల్లో అక్రమ ఆస్తుల పేరుతో ఇళ్లకు మార్క్ పెట్టి నోటీసులు ఇవ్వడంతో నిరుపేదలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించుకొని ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదలు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితర అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, లక్కపాక ముత్తయ్య, వీరబోయిన రవి, శ్రీకాంత్, రాములు, లక్ష్మయ్య, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.



అనాజీపురంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించండి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకూ ఓటుహక్కు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సంధ్యారాణి, యామ రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. జీవో నెంబరు 25 లోని అసంబద్ధ మార్గదర్శకాలను సవరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బ్రహ్మచారి, వెంకట్‌రెడ్డి, కవిత, చంద్రకళ పాల్గొన్నారు.

అర్చకుడిని విధుల్లోకి తీసుకోవద్దని ఆందోళన

పిల్లలమర్రి, సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి శివాలయ అర్చకుడు నందీశ్వరశర్మను విధుల్లోకి తీసుకోవద్దని గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పిల్లలమర్రి శివాలయం ఎదుట కౌన్సిలర్ బచ్చులకురి శ్రీనివాస్ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. గతంలో ఎర్రకేశ్వర స్వామి ఆలయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అర్చకుడికి మరో అవకాశం ఇవ్వాలని గ్రామ పెద్దలు నిర్ణయించగా గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. పూజల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన అర్చకుడిని విధుల్లోకి తీసుకోవద్దని చెప్పడంతో అర్చకుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



పిల్లలమర్రిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

'చిన్నారులు లేకుంటే అంగన్‌వాడీ కేంద్రాల విలీనం'

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: చిన్నారుల సంరక్షణలో ప్రైవేటు పాఠశాలలకంటే అంగన్‌వాడీ కేంద్రాలే నాణ్యమయినవని తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి నర్సింహరావు, సీడీపీవో శ్రీవాణి అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం చివ్వెంల ప్రాజెక్టు స్థాయి పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు నేడు పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు నమోదుకాని కేంద్రాలను ఇతర సమీప కేంద్రాల్లో విలీనం చేస్తామని, అంత వరకు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సాయిగీత, ఎంఈవో పి.ధారాసింగ్, సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, మధులత, సునీత, చైతన్య, జ్యోతి, టీచర్లు అరుణ, శ్రీలత, అనిత, చంద్రమ్మ, పద్మ పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్)లో మాట్లాడుతున్న మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి నర్సింహరావు

'మాయమాటలతో మోసగిస్తున్న కాంగ్రెస్'

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పథకాల అమలులో జాప్యం చేస్తూ మాయమాటలతో ప్రజలను మోసగిస్తోందని భారాస మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు తదితర హామీలు సక్రమంగా అమలు కావడంలేదన్నారు. కేసీఆర్ పాలనలోనే బలహీన వర్గాల ప్రజలు, రైతాంగానికి సరైన ఆదరణ లభించిందన్నారు. పంట రుణమాఫీ విషయంలో వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులు సాకులు చెబుతూ కాలాయాపన చేస్తున్నారని ఆరోపించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్దిరాల, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీతోపాటు పలు తండాల్లో పర్యటించేందుకు ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం మండలానికి రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పాముకాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పాతర్లపహాడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటూరు వెంకటయ్య(58) ఉదయం పొలం వద్దకు వెళ్లి వరం మీదుగా నడుస్తుండగా తాచుపాము కాటు వేసింది. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందారు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.



గుంటూరు వెంకటయ్య

జూదరులపై కేసు నమోదు

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రపహాడ్ శివారులో గుండా సత్తయ్య నిమ్మతోటలో జూద స్థావరాలపై దాడులు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు. ఎర్రపహాడ్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదుచేసి, రూ.6 వేల నగదు, నాలుగు చరవాణిలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నిస్వార్థ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ



సూర్యాపేటలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భానుపురి, న్యూస్‌టుడే: నిస్వార్థ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలు సంఘాల నాయకులు కొనియాడారు. సూర్యాపేటలోని మహాత్మాగాంధీ రోడ్డులో శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. పలు సంఘాల నాయకులు చలమల్ల నర్సింహ, జుట్టుకొండ సత్యనారాయణ, పెండెం కృష్ణ, దూలం నగేష్, యలగందుల సుదర్శన్, వసంత సత్యనారాయణ పిళ్లై, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పుర కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట పుర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. నిజాం పాలకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడు లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుర ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, ఆర్‌వో కల్యాణి, ఏఈ తిరుమలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం తిరుమలగిరి పుర కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుర ఛైర్‌పర్సన్ శాగంటి అనసూయ, కమిషనర్ ఎం.బుచ్చిబాబు, సిబ్బంది, కళాకారులు నివాళి అర్పించారు.



సూర్యాపేట పుర కార్యాలయంలో..

జాజిరెడ్డిగూడెం: అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఎంపీడీవో పవన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ నరసింహరాజు, శిల్పిక, ఉపేందర్ పాల్గొన్నారు.

నాగారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన లక్ష్మణ్ బాపూజీ జయంతిలో ఎంపీడీవో ధార శ్రీనివాస్, ఎంపీవో మారయ్య, ఏపీవో రవి, సూపరిండెంట్ ముత్తయ్య పాల్గొన్నారు.

నూతనకల్: నూతనకల్‌లోని తహసీల్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, మండల వైద్యురాలు అమూల్య, ఏపీవో వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, తదితరులు నివాళి అర్పించారు.

తుంగతుర్తి: మండలకేంద్రంలోని భారాస కార్యాలయంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి భారాస మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు నివాళులర్పించారు.



తిరుమలగిరి పురపాలిక కార్యాలయంలో..

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3182	1459
జైశ్రీరాం	3232	2229
ఐఆర్-64	2076	1576
హెచ్ఎంటీ	2872	2429
కందులు	10,071	4892
పెసర	7242	2359
వేరుసెనగ	7789	2513
బొబ్బర్లు	7059	4559